క్లుప్తంగా

నీటి నాణ్యత పరిశీలన



కొఠారిపురంలో తాగునీటి బోరుబావి పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం : మండలంలో తాగునీటి చేతిపంపు బోర్లు నీటి నాణ్యత పరిశీలిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కొఠారిపురం, బొద్దాం, పెనుబాక, అంతకాపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి బోరు బావులను శుక్రవారం పరిశీలించారు. వాటి పనితీరుపై ఆరా తీసి నాణ్యతను వెబ్‌లో అప్‌లోడ్ చేశామని వెల్లడించారు. పంచాయతీలు, సచివాలయాల ద్వారా క్లోరినేషన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి



సమావేశంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఇళ్లు, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల వార్డ్ అడ్మిన్ సెక్రటరీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు మందగొడిగా జరుగుతున్నాయని బకాయిలున్న వారందరి నుంచి వెంటనే పన్నులు వసూలు చేసేందుకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రెవెన్యూ సర్వీసులన్నీ అడ్మిన్‌ల ద్వారా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పన్నుల వసూళ్లను వీలున్నంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

లారీ మొరాయింపు



రోడ్డు మధ్యలో నిలిచిపోయిన లారీ

సంతకవిటి: మండలంలోని సంతకవిటి-పొందూరు ప్రధాన రహదారిలో అప్పలాగ్రహారం, మిర్తివలస గ్రామాల మధ్య ఉదయం 11 గంటల సమయంలో పొందూరు నుంచి సంతకవిటి వైపు వస్తున్న లారీ సెన్సార్ మొరాయించడంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో అటువైపుగా ప్రయాణించే వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీనితో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆడిట్‌కు సిద్ధంకండి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఆడిటర్

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేసేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీవో రాంబాబు, ఆడిటర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రతీ ఏటా గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులు, ఖర్చులు, జమలపై ఆడిట్ నిర్వహించాలన్నారు. ఆడిట్ చేసేందుకు అవసరమైన అన్ని రికార్డులను పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆడిట్ అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులను ఆడిట్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కుసుమూరులో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్

తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లల హాజరు, కార్యకర్తలు, హెల్పర్ల హాజరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాక్, రికార్డులను తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లల యాక్టివిటీస్ వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, కార్యకర్తలు సమయపాలన పాటించాలని, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సక్రమంగా నిర్వహించాలని కోరారు. తనిఖీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లపై సర్కారు శీతకన్ను

- అధోగతిలో షెల్టర్లు
- పలుచోట్ల షెల్టర్లు లేనివైనం
- మరికొన్నిచోట్ల దుర్వినియోగం
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



రాజాం మండలం వీఆర్‌అగ్రహారం వద్ద శిథిలావస్థలో బస్‌షెల్టర్,



వంగర వెళ్లే రూట్‌లో బూరాడ కూడలి వద్ద మూలకు చేరిన బస్ షెల్టర్



రేగిడి మండలం శిర్లాం-లింగాలవలస జంక్షన్‌లో శిథిలావస్థలో బస్ షెల్టర్

రాజాం : ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు వచ్చే వరకూ విశ్రాంతి తీసుకునే షెల్టర్లు కనుమరుగవుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన ఆర్టీసీ డిపార్ట్‌మెంట్ గతంలో ఈ బస్‌షెల్టర్లు నిర్మించేది. నిర్మాణంలో ఉన్న వాటిని మెయింటెనెన్స్ నిధులతో ఎప్పటికప్పుడు వినియోగంలోకి తీసుకొచ్చేది. గత కొంతకాలంగా వీటి నిర్వహణ అటకెక్కింది. ఫలితంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొన్నిచోట్ల గతంలో నిర్మించిన బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోగా, కొన్నిచోట్ల నిరుపయోగంగా, మరి కొన్నిచోట్ల ప్రైవేట్ వ్యక్తుల వినియోగంలో ఉన్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

రాజాం నియోజకవర్గంలో రాజాం నుంచి రేగిడి, వంగర, సంతకవిటి మండలాలతో పాటు రాజాం మండలంలో పలు శివారు ప్రాంతాలకు రహదారి సౌకర్యంతో పాటు ఆర్టీసీ వాహన సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో గతంలో ప్రయాణికులు తలదాచుకునేందుకు బస్‌షెల్టర్లు ఉండేవి. ఇవి ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. రాజాం నుంచి జి.సిగడాం, పొందూరు వెళ్లే రోడ్డులో పాగిరి కూడలి వద్ద బస్‌షెల్టరు పూర్తిగా దుర్వినియోగంలోకి వెళ్లిపోయింది. బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, గురవాం తదితర ప్రాంతాల్లో ఈ షెల్టర్ల వినియోగం అధ్వానంగా మారింది. రేగిడి మండలంలో ఉంగరాడమెట్ట వద్ద షెల్టర్ ఇంతవరకూ లేదు. శిర్లాం, మజ్జిరాముడుపేట, సంకిలి తదితర ప్రాంతాల్లో వీటి నిర్వహణ కనుమరుగైంది. వంగర మండలానికి వెళ్లే రహదారిలో బూరాడ జంక్షన్ వద్ద బస్ షెల్టర్ పూర్తిగా దుర్వినియోగంలో ఉంది. కాగితాపల్లి, వంగర, మద్దువలస తదితర ప్రాంతాల్లో షెల్టర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. గుళ్లసీతారాంపురంలో ఇంతవరకూ షెల్టర్‌ను ఏర్పాటు చేయలేదు. తాలాడ, గరికిపాడు గ్రామాల వద్ద ఈ షెల్టర్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. సిరిపురం, మండాకురిటి ప్రాంతాల్లో వీటిని నిర్మించలేదు.

వర్షాకాలంలో అవస్థలు

ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న బస్ షెల్టర్లు నిర్వహణ లేకపోవడంతో మూలకు చేరుతున్నాయి. రాత్రి సమయాల్లో మందుబాబులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో ఈ షెల్టర్లు వద్ద చీకటి పడితే ప్రయాణికులు ఉండలేకపోతున్నారు. మరికొన్ని ప్రధాన కూడలిలో షెల్టర్లు లేవు. ఈ వర్షాకాలంలో బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిమిత్తం ఎదురుచూసే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. ప్రయాణానికి ఆధారపడే వారిలో ఎక్కువ మంది వృద్ధులు, విద్యార్థులు ఉంటున్నారు. వీరికి వర్షాకాలంతో పాటు వేసవిలో కూడా షెల్టర్ లేని కష్టాలు ఎదురౌతున్నాయి. శిథిలావస్థలోని బస్‌షెల్టర్ల సమస్యను ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణ వద్ద సాక్షి ప్రస్తావించగా నియోజకవర్గంలో చాలా గ్రామాల ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని కొత్త బస్‌షెల్టర్లు నిర్మించాల్సి ఉందని వెల్లడించారు. రాష్ట్ర విభజన తరువాత ఒక్క షెల్టరు కూడా మంజూరు కాలేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 8 చోట్ల బస్‌షెల్టర్లుకు ప్రతిపాదనలు పెట్టామని వివరించారు.

ఇబ్బందులు పడుతున్నారు..



ఆర్టీసీ వాహనాలు నడిచే రహదారులు వద్ద కనీసం బస్ షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుళ్లసీతారాంపురం, మద్దూరుపేట, సిరిపురం తదితర ప్రాంతాలో బస్ షెల్టర్లు నిర్మించాలి.

– బోనెల ప్రసాద్, జావాం, సంతకవిటి మండలం

ప్రధాన కూడలిలో కష్టాలు



అటు వంగర, ఇటు పాలకొండ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన కూడలి బూరాడ సెంటర్. ఈ కూడలి వద్ద గతంలో చిన్నపాటి బస్ షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం ఈ షెల్టర్ వినియోగంలో లేదు. కొత్తది నిర్మించాలి. ఇక్కడ ప్రతీరోజు వందలాది మంది ప్రయాణికులు నిరీక్షిస్తుంటారు. వీరికి వర్షాలు, ఎండల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీ, బూరాడ, రేగిడి మండలం

మాజీ ఎంపీని కలిసిన 'బొమ్మి'



మాజీ ఎంపీ బెల్లానను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొమ్మి శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లి: మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, బొబ్బిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు శుక్రవారం చీపురుపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనకు రాష్ట్రస్థాయి కమిటీలో చోటు కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, మాజీ ఎంపీ బెల్లానకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సత్యనారాయణ, పార్టీ నేతలు బొమ్మి లక్ష్మంనాయుడు, కిలాడ సూర్యం, బొమ్మి సత్యనారాయణ, కలిగి తిరుపతి, బోడెల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా..!



కోడూరు బీసీ కాలనీలో ప్రభుత్వ బోరు, స్థలం చుట్టూ వేసిన పశువుల పాక, కంచె

బాడంగి: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి బీసీ కాలనీలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోరును, స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కోల లక్ష్మణరావు కబ్జా చేసి పశువుల శాల వేశాడు. అక్కడితో ఆగకుండా బోరు వద్దకు ఎవరూ రాకుండా చుట్టూ కంచె కూడా వేశాడని గ్రామానికి చెందిన శనపతి శ్రీను, జోగి దువ్వారి, శ్రీను, దుద్ది సత్యనారాయణ, కోల సత్యనారాయణ ఆరోపించారు. ఇదే విషయమై గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ఆ స్థలం ప్రభుత్వానిదని.. ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో బోరు స్థలం పల్లం కాగా ప్రజలు వెళ్లేందుకు వంద లోడుల గ్రావెల్ కూడా వేశారని గుర్తు చేశారు. దశాబ్దాలుగా ఆ బోరు నుంచి నీటిని గ్రామస్తులంతా పట్టుకునే వారమని ఇప్పుడు కంచె వేయడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ ఫిర్యాదుపై అధికారులు గురువారం వస్తున్నారని తెలిసి బోరుకు వెళ్లే మార్గంలో కంచె తొలగించాడని పేర్కొన్నారు. ఇది తాత్కాలికమనని శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

బాబూ ష్యూరిటీ - మోసాల గ్యారంటీపై విస్తృత ప్రచారం



కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

మెంటాడ: మండలంలోని కొంపంగి, మీసాలపేట, రాబంద పంచాయతీల్లో బాబు ష్యూరిటీ మోసాల గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్‌లు కూనిబిల్లి వెంకటరమణ, రామునాయుడు, తవుడు ఆధ్వర్యంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు ఎంతలా మోసపోయారో, కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి లెక్క కట్టి మరీ కూటమి ప్రభుత్వం వస్తే మీకు డబ్బులు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క పెన్షన్ తప్ప ఏ హామీని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నాకర్ నాయుడు, బాయి అప్పారావు, సరికి సురేష్ , జక్కువ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నిర్మాణం



రోడ్డుకు అడ్డంగా నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణం

రాజాం :

రాజాం పట్టణ పరిధిలోని హరిజన వీధిలో ప్రధాన సీసీ రోడ్డుపైకి వచ్చే విధంగా ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. రోడ్డు మీదకు వచ్చి నిర్మాణాలు చేస్తుండడంతో వీధిలోకి ఆటోలు, అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ అక్రమ నిర్మాణంపై గ్రామానికి చెందిన పలువురు రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్టు విలేకరులకు శుక్రవారం తెలిపారు. అయినా కమిషనర్ స్పందించకపోవడంతో కలెక్టర్‌ను కలిసి విన్నవించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే సీసీ రోడ్డుపై అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని గ్రామస్తులు కోరినా కమిషనర్ స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయని వారు ఆరోపించారు. ఈ నిర్మాణాన్ని ఇలానే అనుమతిస్తే మరిన్ని నిర్మాణాలు జరిగి రోడ్డు మొత్తం మూసుకుపోతుందని, చివరి వీధుల్లోకి ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఈ నిర్మాణాలపై కమిషనర్ రామప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా హరిజన వీధి గ్రామస్తులు సీసీ రోడ్డుపై అక్రమ నిర్మాణం జరుగుతున్నట్టు ఫిర్యాదు చేసిన విషయవం వాస్తవమేనన్నారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లు ద్వారా నిర్మాణాన్ని పరిశీలించడంతో పాటు మార్కు ఇచ్చిన మేరకు నిర్మాణాన్ని తొలగించాలని నిర్మాణదారునికి సూచించామని అన్నారు. నిర్ణీత గడువులోగా అక్రమ నిర్మాణాలు తొలగించకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం

- హామీలిచ్చి.. అమలు చేయని బాబు
- మాజీ ఎమ్మెల్యే శంబంగి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న శంబంగి వెంకటచినప్పలనాయుడు

బొబ్బిలి: ప్రజలను మోసం చేయడం.. నయవంచనకు గురి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని సంక్షేమాన్ని మరచి ప్రచారానికే ప్రాధాన్యతనిస్తు రోజులు గడిపేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో శంబంగి అధ్యక్షతన శుక్రవారం మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంబంగి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నాడని, రైతులు ఎరువులు, విత్తనాలు లేక అల్లాడుతుంటే ఢిల్లీ టూర్‌లలో బిజిబిజీగా గడుపుతున్నాడని విమర్శించారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేసి చంద్రబాబు మోసాలను ఎండగట్టాలన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నో వందల హామీలను గుప్పించారని వాటి అమలపై చిత్తశుద్ధితో పని చేయడం లేదన్నారు. షరతులు లేని తల్లికి వందనం అందజేస్తామని ఇప్పుడు షరతులతో అనేక మంది తల్లులకు కోతపెట్టారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తానని చెప్పి ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు దమ్ములు పడుతున్నా రైతులకు ఒక్క రూపాయి అందించలేదన్నారు. ఇప్పటికే గతేడాది బకాయిని ఎగ్గొట్టారని ఈ ఏడాది కూడా ఇంతవరకు చెల్లించలేదని దుయ్యబట్టారు. ప్రజా సంక్షేమ పథకాల్లో విఫలమవుతున్న ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి నడిరోడ్డుపై నిలబెట్టాలని ప్రజలకు వైఫల్యాలను అర్థమయ్యేలే వివరించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ శంబంగి వేణుగోపాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అరసాడ శంకర్రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఉత్తరావల్లి అప్పలనాయుడు, వంగపండు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెర్లాం, బాడంగి మండల కేంద్రాల్లో..

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉదయం తెర్లాంలో కార్యకర్తల, నాయకుల సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే శంబంగి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించే ఈ సమావేశంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై దిశానిర్దేశం చేస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం 3గంటలకు బాడంగి మండల కేంద్రంలో ఇదే సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. పై రెండు సమావేశాలకు కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా...

విద్యార్థులకు సత్కారం

రాజాం : పట్టణ పరిధిలోని సారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి పబ్లిక్ పరీక్షల్లో ఆంగ్లంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ట్రిపుల్ ఐటీ, ఎన్ఎమ్ఎమ్ఎస్ సాధించిన ఆరుగురు విద్యార్థులను ఆంగ్ల ఉపాధ్యాయిని బి.హేమలత జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువలతో సత్కరించారు. హెచ్‌ఎం మాధురి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

20న రా.ర.వే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 20న రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించనున్నామని వేదిక కో కన్వీనర్ పిల్లా తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సమాజం-సాహిత్యం-చైతన్యం అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ చింతకింది కాశీం ప్రసంగించనున్నారని అన్నారు.

22న కొబ్బరి చెక్కల వసూళ్లకు వేలం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కొబ్బరి చెక్కల వసూళ్లకు ఈ నెల 22న వేలం నిర్వహించనున్నామని ఈవో పి.శ్యామలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన వేలంలో పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో మరోసారి వేలం నిర్వహిస్తున్నామని అన్నారు. ఆలయ ఆవరణలో దేవదాయ తనిఖీదారు ఆధ్వర్యంలో ఈ వేలం ఉంటుందన్నారు. అధిక ధరకు పాట దక్కించుకున్న వారికి ఈ నెల 23 నుంచి 2027 జూలై 22వ తేదీ వరకు రెండేళ్ల పాటు కాలపరిమితి ఉంటుందని అన్నారు.

గాయత్రిమాతకు ఆషాఢం సారె

రాజాం సిటీ: పట్టణ పరిధి గాయత్రికాలనీలో వెలసిన గాయత్రిమాతకు భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. శుక్రవారం భక్తులకు శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. ఇందులో భాగంగానే వివిధ రకాల పండ్లు, మిఠాయిలతో సారె సమర్పించారు.

గ్రామ సర్వేయర్ల సేవలు ప్రశంసనీయం

తెర్లాం: మండల డిప్యూటీ సర్వేయర్, గ్రామ సర్వేయర్లుగా మండలంలో పనిచేసి బదిలీపై వేరే మండలాలకు వెళ్తున్న వారి సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో మండలం నుంచి వేరే మండలాలకు బదిలీపై వెళ్లిన గ్రామ సర్వేయర్లకు సన్మాన కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సర్వేయర్లను దుశ్శాలువాతో, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించారు. ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ, సీఎస్‌డీటీ స్వర్ణలత, కార్యాలయ అధికారులు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

తెర్లాం: గ్రామ సచివాలయాల్లో కొత్తగా చేరిన ఉద్యోగులంతా బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే ఉద్యోగులపై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ నీలిమ, ఏవో డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు

రేగిడి: మండలంలో అన్ని గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాజాం ఏడీఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తునివాడ 11కేవీ పరిధిలో ఉన్న తునివాడ, వెంకంపేట, కోడిశ, కందిశ, జోడుబందల, చిన్నకోడిశ తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు సిబ్బందితో వైర్లుకు తగిలే చెట్లుకొమ్మలు తొలగించారు. ఆయనతో పాటు ట్రాన్స్‌కో ఏఈ వి.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రం చేసుకోవాలని ఎంఈవోలు ఎంపీ ప్రసాదరావు, బి.ఎరకయ్య సూచించారు. మండల పరిధిలోని చిన్నశిర్లాం, బూరాడ, తాటిపాడు తదితర పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారంగా వంటలు చేయించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. నడిపిల్లి శ్రీరాములునాయుడు, ఎస్.రఘుకుమారి, ఉత్తరావెల్లి సుజాతలను దుశ్శాలువలు, మెమోంటోలతో సత్కరించారు. వీరితోపాటు ఎంఈవోలు ఎంపీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలను హెచ్‌ఎం గ్రంధి రోజారమణి సత్కరించారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి

వంగర: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల కార్యదర్శి పెంకి గౌరిశంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.రమణ, పల్ల మురళి, బి.శ్రీనివాసరావు, బి.చంద్రమౌళి, బి.మురళిధర్, తదితరుల పాల్గొన్నారు.

ఏపీపీగా గోపాలకృష్ణశర్మ

బొబ్బిలి: బొబ్బిలి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా (ఏపీపీగా) సీనియర్ న్యాయవాది గంటి గోపాలకృష్ణను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఈ పదవిలో నెలకు రూ.25వేల చొప్పున గౌరవభృతిని అందజేయనున్నట్టు ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్‌విశ్వజిత్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సహచర న్యాయవాదులు, స్నేహితులు, బంధువులు శర్మను అభినందించారు.

జూదరుల అరెస్టు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని ఖుషీ దాబా వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామని పేర్కొన్నారు. వీరి నుంచి రూ.1420లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

సుమన్‌కు ప్రత్యేక తపాల చంద్రిక బహూకరణ



సుమన్‌కు ప్రత్యేక తపాలా చంద్రిక ఆల్బమ్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బొబ్బిలి: చారిత్రాత్మక బొబ్బిలిలో పురుడు పోసుకుని దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొంది, మన దేశ భౌగోళిక గుర్తింపును పొందిన బొబ్బిలి వీణల ప్రత్యేక తపాలా చంద్రికను రోటరీ క్లబ్ ప్రతినిధులు సినీ నటుడు సుమన్‌కు బహూకరించారు. స్థానిక డీబీఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన సంకల్పం కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు సుమన్‌కు దుశ్శాలువతో సత్కరించారు. రోటరీక్లబ్ ఆర్థిక సహకారంతో తపాల శాఖ వారిచే రూపొందించిన ఈ ప్రత్యేక తపాల చంద్రికను బహుకరించి బొబ్బిలి వీణల ప్రాముఖ్యత, చరిత్రను సుమన్‌కు వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసి రాజు, ఎస్టీవో వెంకటపద్మనాభం, గెంబలి శ్రీనివాసరావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.